క్లుప్తంగా

నేడు ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలు

చాపాడు : మండలంలోని మడూరు, సోమాపురం, ఖాదర్‌పల్లె గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. మడూరు సచివాలయ పరిధిలోని చిన్నవరదాయపల్లె, సోమాపురం సచివాలయ పరిధిలోని మొర్రాయిపల్లె, ఖాదర్‌పల్లె సచివాలయ పరిధిలోని నాగులపల్లె గ్రామాలలో వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఏఓకు సన్మానం



ఏఓ శారదను సన్మానిస్తున్న ఎంపీడీఓ ముజఫర్, పీఆర్ ఏఈ పుల్లయ్య

కాశినాయన : మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తున్న ఎ.శారద సోమవారం వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఈమెకు ఇంకా 3 సంవత్సరాలు సర్వీసు ఉంది. అనారోగ్య కారణాల వలన వలంటరీ రిటైర్మెంట్ తీసుకుందని ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్ తెలిపారు. కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది ఆమెను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ పుల్లయ్య, మహిళా సంరక్షణ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

1న కామర్స్ గెస్ట్ ఫ్యాకల్టీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులకు మార్చి 1వ తేదీ ఉదయం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్బలక్ష్మమ్మ తెలిపారు. ఎంకాంలో 55 శాతం మార్కులు కలిగి, నెట్,సెట్/స్లెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ అర్హత ఉన్న మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటాతో హాజరుకావాలని సూచించారు.

నేడు ఆప్‌కీ ఆవాజ్ నగర మహాసభ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నేడు నగరంలో ఆప్‌కీ ఆవాజ్ నగర మహాసభ నిర్వహించనున్నట్లు ఆర్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడ చూసిన మైనార్టీలపైన దాడులు జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నేటి పరిస్థితుల్లో మైనార్టీలు వారి హక్కుల కోసం ఇతరులపైన ఆధారపడకుండా ఉండేలా చూడడంతో పాటు వారి ఐక్యత కోసం ఆప్‌కీ ఆవాజ్ పని చేస్తుందన్నారు. ఈ సమస్యలపై నగర మహాసభలో చర్చిస్తామని వివరించారు.

అందుబాటులోకి మోకాళ్ల మార్పిడి రోబోటిక్ సర్జరీ

కడప రూరల్ : మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నట్లు నెల్లూరు అపోలో హాస్పిటల్ ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్, రోబోటిక్ రీ ప్లేస్‌మెంట్ సర్జన్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక మానస ఇన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో రోబోటిక్ ద్వారా మోకాళ్ల మార్పిడి సర్జరీని నిర్వహిస్తున్నామన్నారు.

ఈ చికిత్స మహానగరాలలో మాత్రమే లభించేదన్నారు. తాజాగా అత్యాధునిక టెక్నాలజీతో నిర్వహించే రోబోటిక్ సర్జరీ సౌకర్యం అందరికీ అందుబాటులో ఉందన్నారు. గతంలో మోకాళ్ల మార్పిడి సర్జరీ ద్వారా ఎన్నో సమస్యలు ఎదురయ్యేవన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నొప్పి, కోత లాంటివి లేకుండా సర్జరీ ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ సదుపాయం కలదని, అలాగే నిరుపేదలకు ఫీజులో 15 శాతం రాయితీ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు కార్తీక్‌రెడ్డి, వివేకానందరెడ్డి, శశిధర్‌రెడ్డి, పృథ్వి, చెన్నై హెల్త్ కేర్ సర్వీసెస్ అపోలో హాస్పిటల్ ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల సామగ్రి వితరణ

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని ఎర్రమాసపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు క్రీడాసామగ్రిని వితరణగా ఇచ్చారు. ఈ క్రీడా సామగ్రిని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌ఎస్‌మూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు పిల్లల మానసిక వికాసానికి ఎంతో తోడ్పాటునిస్తాయన్నారు. బీటెక్ విద్యార్థులు మానవ సేవే మాధవ సేవని గుర్తు చేస్తూ తమ వంతుగా విద్యార్థులకు క్రీడా సామగ్రి అందచేయడం అభినందనీయం అన్నారు. కొప్పర్తి గ్రామ అసిస్టెంట్ ఇంజనీర్ జగదీశ్వర్ రెడ్డి, ఇరిగేషన్ డిపార్టుమెంట్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సునీల్‌కుమార్, కళాశాల పీడీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



కొట్టాల గ్రామంలో సంక్షేమ బావుట పుస్తకాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరు పంచాయతీ కొట్టాల గ్రామంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టాల రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోకి రాగానే ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయా, అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రంగారెడ్డి అడిగిన సమస్యలను ముందుగా పరిష్కరిస్తానని, తనకు ఇచ్చే రూ.2 కోట్ల నిధులలో ఈ గ్రామానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి సహకారం అందించాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, నాయకులు నారపురెడ్డి, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, రంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, గౌతమ్‌రెడ్డి, సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కూలూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న చర్చిని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పరిశీలించారు. సోమవారంతో మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం ముగిసింది.

లింగ వివక్షపై అవగాహన కల్పిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రహాసరెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రస్తుత సమాజంలో ఆడపిల్లల పుట్టుకలు తగ్గిపోతున్నాయని, ఆ సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరికీ లింగ వివక్షపై అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీమాంక్ ఆసుపత్రిలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఎస్‌డీఎల్‌ఎంఎంఏ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఆడపిల్లల నిష్పత్తిని పెంచాలంటే ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం, స్కానింగ్ సెంటర్ల యజమానులు లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా చూడాలని, ఇందుకు కమిటీ సభ్యులు నిఘా ఉంచాలని కోరారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే స్కానింగ్‌కు వచ్చే వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమనే ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, రేడియాలజిస్టు డాక్టర్ రామలక్షుమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో బీజేపీ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కడప జిల్లా కన్వీనర్ వి.శివయ్య

ప్రొద్దుటూరు : పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ చట్టం చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కడప జిల్లా కన్వీనర్ వి.శివయ్య ఆరోపించారు. జిల్లాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో చేపట్టిన రెండో విడత సంగ్రామ పాదయాత్ర సోమవారం ప్రొద్దుటూరుకు చేరుకుంది. సంజీవనగర్ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కడప జిల్లా కన్వీనర్ ఇ.శివశంకర్ మాదిగ, గడ్డం నరసింహులు మాదిగ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణ నూతన అధ్యక్షుడుగా గుడిపాడు లాలిని ఎన్నుకున్నారు. ఎంఎస్‌పీ నాయకులు చిన్నయ్య మాదిగ, మత్తయ్య మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్న సుబ్బయ్య, ఓబులేసు ఓబన్న పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. మానవ మనుగడకు ముప్పు



కళాజాత బృందంతో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : అడవికి నిప్పు పెట్టడం వలన మానవ మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఎఫ్‌ఆర్‌ఓ మధుబాబు పేర్కొన్నారు. బద్వేలు ఫారెస్టు రేంజ్ పరిధిలోని బాలాయపల్లె, కొత్తచెరువు, రామాపురం, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో సోమవారం అడవికి నిప్పు – మానవాళికి ముప్పు అనే అంశంపై కళాజాత బృందంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులకు నిప్పు పెట్టడం వలన అడవుల్లోని జంతువులు, పక్షులు, అనేకరకాల జీవరాశులు, ఔషధమొక్కలు కాలిపోవడం వలన మానవజాతి మనుగడకు ముప్పువాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటశేషయ్య, ఎఫ్‌బీఓలు శ్యాంసుందర్, సుదర్శన్, రాజేష్, సువర్ణకుమార్, పుష్పరాజ్, మునాఫ్, షాజహాన్, లక్ష్మీనరసమ్మ, సుంకయ్యలతో పాటు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా పోరుమామిళ్ల



పతకాన్ని బహుకరిస్తున్న రవిప్రకాష్‌రెడ్డి

పోరుమామిళ్ల : మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌గా నిలచారని మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. సబ్ జూనియర్స్, కేడెట్ విభాగాల్లో పోరుమామిళ్లకు 18 బంగారు, 18 రజత, 11 కాంస్య పతకాలు దక్కాయన్నారు. పతకాల పట్టికలో మొదటిస్థానంలో నిలచి పోరుమామిళ్ల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలచిందన్నారు. 11 బంగారు, 8 రజత, 16 కాంస్య పతకాలు సాధించి ప్రొద్దుటూరు ద్వితీయస్థానంలో, 7 బంగారు, 3 రజత, 6 కాంస్య పతకాలతో జమ్మలమడుగు తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. విజేతలకు మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాష్‌రెడ్డి, ఎస్‌ఐ హరిప్రసాద్ పతకాలు బహుకరించారన్నారు. పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.

సమస్యను తెలుసుకున్నారు.. చేయూతనందించారు



డబ్బు అందిస్తున్న ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల : విద్యను అందించడంలోనే కాదు విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలోనూ ఆ ఉపాధ్యాయులు ముందున్నారు. గానుగపెంట జెడ్పీహెచ్‌ఎస్‌లో గతంలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు ఆ పాఠశాలకు ప్రహరీ, క్రీడా మైదానం ఏర్పాటుకు స్థలం లేకపోవడంతో అసౌకర్యంగా ఉందని తెలుసుకున్న వారు పాఠశాలకు స్థలం సమకూర్చేందుకు చేయూత నందించారు. పాఠశాలలో 2009–2017 వరకు విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు జి. అబ్దుల్‌జబ్బార్, జి. అంబేద్కర్, జి. సౌభాగ్యలక్ష్మి, లక్ష్మిరెడ్డి, శేషారెడ్డి, గోవిందు, ఎ.వి. ప్రసాదరావు, జి. బాబాలు రూ. 40,000 సేకరించి సోమవారం ప్రధానోపాధ్యాయుడికి ఎస్టీయూ అధ్యక్షుడు రమణారెడ్డి సమక్షంలో నగదును అందించారు. హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిరుధాన్యాల సాగుతో అధిక రాబడి

కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య



మాట్లాడుతున్న కేవీకే కో–ఆర్డినేటర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: చిరుధాన్యాల సాగుతో అధిక రాబడిని సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2023 ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. సోమవారం కేవీకేలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 13వ విడత రైతుల ఖాతాలో జమ ప్రత్యేక వీక్షణ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో అధికరాబడిని పొందవచ్చన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి శ్రీనివాసచారి, ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ మురళీకృష్ణ సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, జీవ రసాయనిక పద్ధతులు గురించి వివరించారు. ఆత్మ పీడీ విజయలక్ష్మి, ఆత్మ పథక ఉప సంచాలకులు పద్మలత భూమిలో సేంద్రియ కర్బన పదార్థాన్ని ఎలా పెంచుకోవాలో వివరించారు. శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, శిల్పకళ, ప్రశాంతి, మహేష్‌బాబు, మానస పాల్గొన్నారు.

సైన్స్ పుస్తకాన్ని ఆవిష్కరించిన జేవీవీ

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సర్ సీవీ రామన్ రచించిన 'ఆకాశం నీలంగా ఎందుకు ఉంటుంది' పుస్తకాన్ని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఆవిష్కరించారు. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా ఎండీ చలపతి తెలుగులో అనువదించిన ఈ పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరిచారు. ఈ సదర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్ సీవీ రామన్ రోజువారి జీవితంలో ఆశ్చర్యాన్ని కలిగించే ప్రకృతి రహస్యాలను, శాస్త్రీయ విజ్ఞానాన్ని పుస్తకాల ద్వారా మనకు అందించారని తెలిపారు. జేవీవీ అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ సైన్స్‌లో నోబుల్ బహుమతి పొందిన భారతీయుల్లో సీవీ రామన్ మొదటి వారని, ప్రకృతిపై తనకు వచ్చిన ప్రతి సందేహాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి నిర్ధారించుకున్నారని తెలిపారు. సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు బయపురెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆదినారాయణ, భూషణంరెడ్డి, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, రాజశేఖర్‌రెడ్డి, రవిశేఖర్, శ్రీ నిత, వీర నాగేంద్రకుమార్, కల్పన పాల్గొన్నారు.

అడవి ప్రయోజనాలపై అవగాహన

కడప కార్పొరేషన్: అడవికి నిప్పు పెడితే మానవాళికి ముప్పు వాటిల్లుతుందని డీఎఫ్‌ఓ వీవీ సందీప్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని మామిళ్లపల్లె, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో అగ్గి పెట్టడం వల్ల తరతరాలుగా పెంచి పోషిస్తున్న వృక్ష, జంతు జాతి నశించిపోతుందన్నారు. వేసవిలో అడవికి నిప్పు పెట్టకుండా అటవీశాఖకు సహకరించాలన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం ఇలాంటి వారు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఎఫ్‌ఆర్‌ఓ ఓబులేశు, ఎఫ్ఎస్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు సహకరించండి

కడప కల్చరల్ : పుష్పగిరి దివ్యక్షేత్రంలో తాము ఆ క్షేత్రం పీఠాధిపతి ఆధ్వర్యంలో చేపట్టిన గిరి ప్రదక్షిణకు భక్తులు, ప్రముఖులు సహకరించాలని జిల్లా అర్చక పురోహిత ఐక్యవేదిక అధ్యక్షులు విజయ్‌భట్టర్, జగన్మాత మారెమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు సట్టి భారతి, శ్రీ కల్యాణ సీతారామాలయం ధర్మకర్త వేణుగోపాల్ తదితరులు తెలిపారు. సోమవారం నగరంలోని బ్రాహ్మణవీధిలోగల సంస్థ కార్యాలయంలో విజయభట్టర్ విలేకరులకు ఈ వివరాలు తెలిపారు.

గిరి ప్రదక్షిణ పుష్పగిరిలో 60 ఏళ్ల క్రితం ఉండేదని, ఇది పురాతన సంస్కృతిలో భాగమని, దేశంలో కేవలం రెండు చోట్ల మాత్రమే ఉందన్నారు. పీఠాధిపతి అనుమతితో ఈ సంప్రదాయాన్ని పునరుద్ధరించేందుకు తాము ధార్మిక వేత్తలతో కలిసి కార్యక్రమానికి ముహూర్తం నిర్ణయింపజేశామన్నారు. సట్టిభారవి మాట్లాడుతూ మార్చి 1న ఉదయం 7.46 గంటలకు 'పుష్పగిరి' ప్రదర్శనను పీఠాధిపతి పరిక్రమారంభ పేరిట ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించాలని డిప్యూటీ సీఎంతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులకు ఆహ్వానాలు అందించామని తెలిపారు.

వనరుల అన్వేషణకు నైపుణ్యాలు అవసరం

వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి



సదస్సులో పాల్గొన్న వైవీయూ ఆచార్యులు

వైవీయూ: అసాధారణ వనరుల అన్వేషణకు భూగర్భ శాస్త్రవేత్తలకు నైపుణ్యాలు అవసరమని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైవీయూ భూగర్భశాస్త్రశాఖ ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జియో సైన్స్' అన్న అంశంపై ఐదురోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న జాతీయ సాంకేతిక సదస్సును సోమవారం ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు, వాటిని ప్రాసెస్ చేయగల సామర్థ్యం సమకాలిన సమాజానికి అవసరమని, వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా పరిశోధకులు కృషిచేయాలని సూచించారు. చెన్నైలోని మద్రాస్ విశ్వవిద్యాలయం భూగర్భశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.ఎం. హుస్సేన్ మాట్లాడుతూ శిలాజశాస్త్రం ఏ విధంగా ఉపయోగపడతాయో విశదీకరించారు. సదస్సు కన్వీనర్లు వైవీయూ ఆచార్యులు వి. సునీత, కె. రఘుబాబు మాట్లాడారు. ఆచార్య జి. సుదర్శన్ రాజు, ఆచార్య ఎన్. జయరాజు, డా. ఎస్. శ్రీనివాసగౌడ్, డా. ఆర్. సిద్దిరాజు పాల్గొన్నారు.

కార్మికులకు మెస్ చార్జీలను పెంచాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు మెస్ చార్జీలను పెంచాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనలో డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు మేరీ పార్వతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారు వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. సోమవారం ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ కార్యాలయంలో మండలంలోని ఎంపీటీసీ, సర్పంచ్‌ల తోపాటు పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ అభ్యర్థిని పరిచయం చేశారు. గ్రామ పంచాయతీల వారిగా పట్టభద్రుల ఓటర్ల జాబితాను పార్టీ నాయకులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో బ్యాలెట్ నమూనా పత్రం వస్తుందని, ప్రతి ఓటరుకు ఇచ్చి ఓటు వేసేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీల వారిగా నాయకులు ప్రతి ఓటరును కలసి సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు రాముడు, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, ఏటూరు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్షా సమావేశం

దువ్వూరు : మండలంలోని పాత దువ్వూరు కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై సమీక్ష నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు కార్యకర్తలతో సమావేశం

చాపాడు : మార్చి 13న జరుగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై మంగళవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు మండల అధ్యక్షుడు తెలిదేల లక్ష్మయ్య తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు చాపాడులోని ఇండేన్ గ్యాస్ కేంద్రం వద్ద నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరూ హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

అందుబాటులో ఫొటో ఓటర్ల జాబితా



ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న కమిషనర్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డుకు సంబంధించిన ఫొటో ఓటర్ల జాబితాను సోమవారం నుంచి వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ 30వ వార్డుకు పురపాలిక ఆకస్మిక ఎన్నికలు 2023 పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆ వార్డుకు సంబంధించిన ఫొటో ఓటర్ల జాబితాను పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రచురించిన ఫొటో ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే రాతపూర్వకంగా తెలపాలని కోరారు.

ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి



టి.సండ్రపల్లెలో పంట నమోదును పరిశీలిస్తున్న అరవిందనాయక్

గోపవరం : మండలంలో రబీ సీజన్‌లో సాగైన 682 ఎకరాల్లో ఇప్పటివరకు ఈ–పంట నమోదు చేశామని మండల వ్యవసాయాధికారి అరవింద నాయక్ తెలిపారు. టి.సండ్రపల్లెలో క్షేత్రస్థాయిలో ఈ–పంట నమోదును ఆయన పరిశీలించారు. పంట సాగుచేసిన ప్రతి రైతు ఈ–పంట నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం టి.సండ్రపల్లె, రాచాయపేట సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వ్యవసాయ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈకేవైసీ గడువు మంగళవారంతో ముగుస్తున్నందున ఈ–పంట నమోదు చేసుకున్న రైతులందరికీ ఈకేవైసీ చేయించాలన్నారు. ఈ–పంట నమోదు చేసిన జాబితా ఆధారంగానే రైతులకు రాబోయే రోజుల్లో రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు అర్హులని తెలిపారు.

ప్రీతి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : కాకతీయ యూనివర్సిటీలో వైద్య విద్యను అభ్యసిస్తున్న ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌వర్మ తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక బైపాస్‌రోడ్డు కూడలిలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ పేరుతో ప్రీతిని మానసిక క్షోభకు గురిచేసి ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇమ్మానుయేలు, సామాజిక చైతన్య సమితి నాయకులు గంగయ్య, కృష్ణ, సురేష్, ఓబయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వజ్రాభరణాల ప్రదర్శన



వజ్రాభరణాల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని వసంతపేటలో ఉన్న బుశెట్టి ధనలక్షుమ్మ శ్రీనివాసులు కమ్యూనిటీ హాల్‌లో మూడు రోజుల పాటు జరిగిన బుశెట్టి జ్యూవెలర్స్ గ్రాండ్ ఎగ్జిబిషన్ ప్రజలను ఆకట్టుకుంది. కిష్ణ డైమండ్స్ వారి సౌజన్యంతో బుశెట్టి జ్యూవెలర్స్ గ్రాండ్ ఎగ్జిబిషన్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు వజ్రాభరణాల ప్రదర్శన నిర్వహించారు. ఇందులో సుమారు 2వేల డిజైన్‌లతో బీఐఎస్ హాల్‌మార్క్, సర్టిఫికెట్ కలిగిన డైమండ్స్ నగలను ప్రదర్శించారు. రూ. 7వేల నుంచి రూ. 20 లక్షల వరకు ఉన్న రింగ్స్, చెవి రింగ్‌లు, బ్రాస్‌లెట్, గాజులు, బ్లాక్ బీడ్స్ చైన్స్, నెక్లెస్, లాంగ్ చైన్‌లు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. ఆభరణాలపై ఒక సంవత్సరం ఉచిత బీమా కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కష్టమర్ల అభిరుచికి తగ్గట్లు వివిధ రకాల జ్యూవెలరీ అందుబాటులో ఉంచినట్లు బుశెట్టి జ్యూవెలర్స్ అధినేత బుశెట్టి రామ్మోహన్‌రావు తెలిపారు.

2న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్చి 2న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున దాసరి తెలిపారు. తిరుపతి జిల్లాలోని శ్రీ సిటీలోని మల్టీనేషనల్ కంపెనీ ఎన్ఎస్ ఇంస్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ట్రైనీగా పనిచేసేందుకు బీఎస్సీ (ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, ఎంపీసీ), డిప్లొమా చదివి 2018 నుంచి 2022వ సంవత్సరంలోపు 18–26 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన యువతీ యువకులు అర్హులన్నారు.